పిల్లల ఆరోగ్యానికి ఆల్బెండజోల్

శివ్వంపేట: గూడురు కేజీబీవీలో నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

తూప్రాన్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణలో భాగంగా విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్: రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీడబ్ల్యూవో బ్రహ్మాజీ

నర్సాపూర్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

పిల్లల్లో రక్తహీనతను అధిగమించడానికి ఆల్బెండజోల్ మాత్రలు పని చేస్తాయని, అందుకు ప్రభుత్వం ఉచితంగా నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెల్దుర్తి, శివ్వంపేట, నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు గురువారం పంపిణీ చేశారు. చిన్న వయసులో నులిపురుగులతో వచ్చే రక్తహీనతను అధిగమించడానికి, రోగనిరోధకశక్తిని పెంపొందించుకోవడానికి ఈ మాత్రలు పనిచేస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి: కలెక్టర్

పిల్లల ఎదుగుదలకు అడ్డుపడే నులిపురుగుల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. తూప్రాన్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను కలెక్టర్ పంపిణీ చేశారు. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏండ్ల వయస్సున్న 2,36,000 మంది పిల్లలకు మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని తల్లిదండ్రులు ఉపయోగించుకుని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. - న్యూస్‌నెట్‌వర్క్, మెదక్, జూన్20

- రక్తహీనతను అధిగమించడానికే ఈ మాత్రలు
- ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉండాలి
- నులిపురుగుల నివారణ మాత్రలతో జీవన నాణ్యత మెరుగవుతుంది
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- 19ఏండ్ల లోపు పిల్లలందరూ నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలిపిచెడ్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి, ఎంపీడీవో ఆనంద్

మెదక్ రూరల్: మాల్కాపూర్‌లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది

చేగుంటలోని ఎస్టీ బాలికల గురుకుల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్,ఎంపీటీసీ వెంకటలక్ష్మి

పాపన్నపేటలోని పాఠశాలలో నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్ నర్సింహులు

నిజాంపేట: నందిగామలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న కార్యదర్శి ఆరిఫ్, వైద్య సిబ్బంది

చిన్నశంకరంపేటలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

నేడు గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 20: మెదక్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థినులకు నేడు (శుక్రవారం) స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ వాసంతి పిళ్లై గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (ఆర్ట్స్), బీకాం, బీఎస్సీ(లైఫ్ సైన్స్), (ఫిజికల్ సైన్స్)లో సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు వెంట తీసుకుని రావాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

రాజు సైకియా

మనోహరాబాద్, జూన్ 20: వ్యక్తి అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాంకు చెందిన రాజు సైకియా, అతని కుటుంబంతో జీవనోపాధి కోసం మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామానికి పదేండ్ల క్రితం వలసవచ్చాడు. రంగాయిపల్లిలోని మోడల్ సేఫ్టీ గ్లాస్ పరిశ్రమలో పని చేసుకుంటున్నాడు. ఈ నెల 15న పరిశ్రమకు వెళ్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో అతని భార్య, బంధువులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బడీడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలి

చిన్నశంకరంపేట, జూన్ 20: బడీడు పిల్లలందరిని సర్కారు స్కూళ్లలో చేర్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ సూచించారు. గురువారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణి చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
EDUCATION
★ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్రియయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి

- బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి కిరణ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 20: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి కసాపురం కిరణ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు విద్యనందించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పేరిట తల్లిదండ్రుల నుంచి వేలు రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోవడంతోనే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మితిమీరి పోతున్నాయన్నారు. ఇప్పటికైన విద్యాశాఖాధికారులు పట్టించుకోవాలని కోరారు. ఫిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులను వెంటనే సీజ్ చేయాలన్నారు.

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, జూన్ 20: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలతో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ, ఉపాధి పథకం అధికారులతో కలిసి మరోసారి రివ్యూ సమావేశం ఉంటుందన్నారు. ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీడీవో రఫీకున్నీసా, తహసీల్దార్ గ్రేసీ బాయి, ఆయా శాఖల అధికారులు, తదితరులున్నారు.

ఆఫ్‌లైన్‌లో టీచర్ల బదిలీలు చేపట్టాలి

పాపన్నపేట జూన్ 20: ఉపాధ్యాయుల బదిలీలను ఆఫ్‌లైన్‌లోనే చేపట్టాలని పీఆర్‌టీయూ మండల కార్యదర్శి రాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ మల్టీజోన్1లో చేపట్టిన ఉద్యోగోన్నతుల్లో అనేక సమస్యలు తలెత్తాయన్నారు. స్కూల్ అసిస్టెంట్‌తో పోల్చుకుంటే ఎస్జీటీలు ఎక్కువగా ఉంటారని, వెబ్ కౌన్సెలింగ్ ఆప్షన్ ఇవ్వడం సరికాదన్నారు. టీచర్ల బదిలీలు ఆఫ్ లైన్‌లోనే చేపట్టాలని కోరారు.

తాగు నీటి ఎద్దడి రావద్దు: ఎంపీపీ

చేగుంట,జూన్20: చేగుంట మండలం వడియారంలో తాగు నీటి సౌకర్యం కోసం బోరు మోటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఎంపీటీసీ బక్కిలక్ష్మీరమేశ్, పంచాయతీ కార్యదర్శి విజయపాల్‌రెడ్డి, నాయకులు బాలయ్య తదితరులు

మానవత్వం చాటిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట: బైక్‌పై నుంచి కిందపడిన వారికి నీరు తాగిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ

శివ్వంపేట/ వెల్దుర్తి, జూన్ 20: బైక్‌పై వెళ్తూ కిందపడిన భార్యాభర్తలు, ఓ చిన్నారికి సాయం చేసి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మానవత్వం చాటుకున్నారు. శివ్వంపేట మండలంలో ఎమ్మెల్యే తన కార్యక్రమం పూర్తి చేసుకుని వెల్దుర్తికి వెళ్తున్న క్రమంలో పోతులబొగుడ పంచాయతీ పరిధిలోని శంశీ రెడ్డిపల్లితండాకు చెందిన లక్ష్మణ్ తన కుటుంబంతో కలసి శివ్వంపేటకు వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. అదే రోడ్డు గుండా ఎమ్మెల్యే, ఎంపీపీ హరికృష్ణ వెళ్తున్నారు. వారిని పైకి లేపి నీరు తాగించి వారితో కాసేపు మాట్లాడారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

వెల్దుర్తికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముల్క శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే సునీతా రెడ్డి పరామర్శించారు. వెల్దుర్తికి వచ్చిన ఎమ్మెల్యే ముల్క శ్రీనివాస్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్‌కు కావాల్సిన వైద్య చికిత్స, ఆరోగ్యం మెరుగుపడేందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామన్నారు.

వెల్దుర్తిలో బీఆర్ఎస్ నాయకుడు ముల్కశ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

మెదక్ అర్బన్,జూన్20:తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షులు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కే.రామనారాయణను మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు శంకర్‌దయాల్ చారి, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, ఐజే యూ సభ్యులు బుక్క అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజే శ్రీనివాస్ శర్మ సన్మానించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎంఏకే ఫైజల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ శ్రీనివాస్ శర్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రంగాచారి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి సంక్షేమ అధికారుల పరీక్షలు

- పరీక్ష రాయనున్న 3,700 మంది అభ్యర్థులు: కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 20: గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాల సంక్షేమ అధికారుల పోస్టులకు ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించమన్నారు. జిల్లాలో 3,700 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్, అపెండెక్స్ త్రీని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు సమర్పించాలన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ గేటుకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు, పంచాయతీ కార్మికులు

నర్సాపూర్, జూన్ 20: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ గేటుకు వినతి పత్రం అందజేశారు. 9 నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఆయనతో కార్మికులు బందేలి, సలీం, నర్సింహులు, మల్లేశం, పోచయ్య, లింగం, పెంటయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని ధర్నా

లబ్ధిదారులను సముదాయిస్తున్న తహసీల్దార్, సీఐ, ఎస్సైలు

రామాయంపేట, జూన్ 20: డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని పట్టణంలోని ఖాళీగా ఉన్న 54 డబుల్ బెడ్‌రూమ్‌లను పేదలు గురువారం స్వాధీనం చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రామాయంపేట శివారులోని 304 ఇండ్లు నిర్మించిందని, అందులో 250 ఇండ్లను లబ్ధిరులకు అందజేశారన్నారు. మిగిలిన 54 ఇండ్లను పట్టణంలోని రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన వారికి ఇస్తామంటూ ఎవరికీ ఇవ్వలేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రజినీకుమారి, సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై రంజిత్ అక్కడికి చేరుకుని లబ్ధిదారులకు నచ్చజెప్పారు. ఇక్కడ ఉన్నవారంతా ఆధార్ కార్డు జిరాక్సులు ఇస్తే వాటిని పరిశీలించి అర్హులైన వారికి ఇండ్లు ఇచ్చేలా కృషి చేస్తానని తహసీల్దార్ రజినీకుమారి తెలిపారు. దీంతో లబ్దిదారులు జిరాక్సులను అధికారులకు అందజేశారు.

భూమికి భూమే కావాలి

- ఎకరానికి రూ.60 లక్షలు ఇవ్వాలి

నర్సాపూర్, జూన్ 20: కాళేశ్వరం కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోతున్న పెద్దచింతకుంట, రెడ్డిపల్లి గ్రామాల రైతులతో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి నర్సాపూర్, రెడ్డిపల్లి రైతువేదికలో గురువారం సమావేశం నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతుల అభ్యంతరాలను అడుగగా కోల్పోతున్న భూములకు బదులు వేరే చోట భూమి ఇప్పించాలని లేదా ఎకరానికి రూ.60 లక్షలు చెల్లించాలని రైతులు చెప్పారు. రైతుల అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సంగారెడ్డి కెనాల్ రీచ్-2 లో భూములు కోల్పోతున్న పెద్దచింతకుంట, రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతులతో అవార్డు విచారణ నిర్వహించామన్నారు. మార్కెట్ ధరతో సమానంగా భూములకు ధరలు నిర్ణయించాలని రైతులు కోరారన్నారు. రైతుల వినతులు, అభ్యంతరాలను స్వీకరించి, విధానపరమైన నిర్ణయాలకు సంబంధించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. తహసీల్దార్ కమలాద్రి, పెద్దచింతకుంట మాజీ సర్పంచ్ శివకుమార్ పాల్గొన్నారు.

కస్తూర్బా లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 20: జిల్లా కేంద్రం మెదక్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీ సీట్లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 6వ తరగతిలో ప్రవేశాలకు మెదక్ మండలానికి చెందిన 5వ తరగతి పూర్తి చేసుకున్న బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్‌లో మెదక్ జిల్లాకు చెందిన బాలికలు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఈనెల 27వ తేదీ నుంచి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సంప్రదించాలన్నారు.

అసిస్టెంట్ కుక్ నియామకానికి దరఖాస్తు చేసుకోవాలి

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మహిళా అసిస్టెంట్ కుక్ (వంట మనిషి) నియామనికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వంట చేసిన అనుభవం కలిగి జూన్ 2024 నాటికి 18 నుంచి 45 ఏండ్ల వయస్సు ఉండాలన్నారు. ఆసక్తి గల వారు 21 నుంచి 24వ తేదీలోగా పాఠశాల పని దినాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి: బీడీ కార్మికులు

నిజాంపేట, జూన్ 20: భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ నస్కల్ గ్రామానికి చెందిన మహిళా బీడీ కార్మికులు గురువారం తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 ఏండ్ల క్రితం సర్వే నంబర్ 842లో ఇండ్ల నిర్మాణాలకు 6 ఎకరాల భూమిని కొన్నామన్నారు. అందులో కొంత మంది కార్మికుల ఆర్థిక పరిస్థితి బాగాలేక స్థలాలు అమ్ముకోగా, కొన్నవారు మాత్రం ఇంటి ముందున్న ఖాళీ స్థలాన్ని కూడా రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. తహసీల్దార్ స్పందించి ఆర్ఐ, సర్వేయర్‌ను పంపించి, రిపోర్టు తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని బాధితులకు తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, బీడీ కార్మికులు రాజ్‌బీ, సిద్ధవ్వ, పోలు లక్ష్మి, చంద్రవ్వ, లక్ష్మి, కళావతి, విజయ, పోచవ్వ, నర్సవ్వ, సుశీల, బుచ్చవ్వ, రాజవ్వ, అంజమ్మ, అనసూయ, కాశీంబీ, జయమ్మ, పద్మ, కరుణ, ఎల్లవ్వ తదితరులు ఉన్నారు.

ఉదారత చాటిన పూర్వ విద్యార్థి

పాపన్నపేట జూన్ 20: పాపన్నపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి మన్నె ఉపేందర్ ఫర్నీచర్, నీటిశుద్ధి యంత్రం, అల్మారా, విద్యార్థులకు బూట్లు, నోట్ పుస్తకాలు ఆయన ప్రతినిధి కైలాస్ ద్వారా గురువారం అందించారు. మండల నోడల్ అధికారి ప్రతాప్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం మహాశ్రీ ఈశ్వర్, శ్రీనివాస్‌రావు, పాఠశాల చైర్మన్ భవాని, మాజీ చైర్మన్ దుర్గా గౌడ్, ఉపాధ్యాయులు సంగీత, జయవర్ధన్, నాగరాజ్, కిషన్, అంజాగౌడ్, రాజు, ఎల్లం ఉన్నారు

నీటి సమస్యను పరిష్కరిస్తా..

రామాయంపేట, జూన్ 20: గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరిస్తానని పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని గురుకుల బాలికల డిగ్రీ కళాశాలను సందర్శించి, అక్కడ నెలకొన్న నీటి సమస్యపై ప్రిన్సిపాల్ శిరీషను కలిసి ఆరా తీశారు. చైర్మన్ ఆదేశాలతో కళాశాలలో నెలకొన్న సమస్యను పరిష్కరించారు.